క్లుప్తంగా

కళాశాలల్లో 'మధ్యాహ్న భోజనం' అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

పాయకరావుపేట : మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో కూడా ప్రవేశ పెట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జీ, జి.ఫణేంద్ర పేర్కొన్నారు. పాయకరావుపేట ఏరియాలో గల సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలన్నారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఇంతవరకు పుస్తకాలు సరఫరా చేయలేదన్నారు. అనంతరం మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కరుణాకర్, సిద్ధార్థ, సందీప్, నవీన్, దీపిక, సునీత పాల్గొన్నారు.

సచివాలయానికి బ్యాంక్ ఆఫ్ బరోడా వితరణ



తోటాడ సచివాలయానికి కుర్చీలు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్

మునగపాక : తోటాడ సచివాలయానికి గురువారం బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ఆధ్వర్యంలో 20 కుర్చీలను బహూకరించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవంలో భాగంగా ఈ వితరణ అందజేశారు. తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావుకు అందజేశారు.

అణుకు గిరిజనుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న గిరిజనులు

కోటవురట్ల: సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష పట్ల అధికారులు స్పందించకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. రోడ్డు నిర్మించాలని, పాఠశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో గిరిజనులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు.

అమ్మవారి పండగల సందడి



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో ఆధ్యాత్మిక సందడి నెలకొని ఉంది. అచ్యుతాపురం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పండగలతో గ్రామాలు సందడిగా మారాయి. అచ్యుతాపురంలో నిర్వహించిన మరిడిమాంబ పండగను పురస్కరించుకొని సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ విమలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎం.జగన్నాథపురం గ్రామంలో గుర్రప్ప తల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు.

జోరుగా ఇంటింటికీ కుళాయి పనులు

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు తెలిపారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. సచివాలయ కన్వీనర్ సరిసా శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ఇంటింటా సర్వేకు సహకరించండి



రాజకీయ పక్షాలతో సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో రామలక్ష్మి

నక్కపల్లి : ఓటర్ల నమోదు, తొలగింపునకు సంబంధించి త్వరలో ప్రారంభం కానున్న ఇంటింటా సర్వేకు సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.వి.రామలక్ష్మి కోరారు. గురువారం ఆమె నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల నమోదు, తొలగింపునకు సంబంధించి త్వరలోనే బీఎల్‌వోలు ఇంటింటా సర్వే చేపడతారన్నారు. ఈ సమయంలో బీఎల్‌వోకు సరైన ఆధారాలు సమర్పించి ఓటర్ల నమోదు, తొలగింపునకు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు దరఖాస్తులు తీసుకునే సమయంలో అన్ని నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. దరఖాస్తుపై కుటుంబ సభ్యుడితో పాటు ఇద్దరు సాక్షులు సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు. సవరణలు, తొలగింపుల విషయంలో బాధిత ఓటరుకు భౌతిక నోటీసు అందించకుండా సాక్షుల సంతకాలు లేకుండా నోటీసును గోడలపై అతికించడానికి కుదరదన్నారు. బీఎల్‌వోలు తొలగింపులు, సవరణలు, చేర్పుల విషయంలో సొంత నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదన్నారు. అధీకృత అధికారి ఆమోదం తప్పనిసరి అన్నారు. బీఎల్‌వోలు కేవలం ఫీల్డ్ వెరిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ నోటీసుల జారీ వంటి పనులకు మాత్రమే పరిమితమన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో వచ్చిన దరఖాస్తులు బీఎల్‌వోల నివేదిక తర్వాత ఈఆర్‌వోకు తెలియజేయడం జరుగుతుందన్నారు. బీఎల్‌వోల వెరిఫికేషన్ దరఖాస్తులను ఏఈఆర్‌వోలు కూడా పరిశీలించాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌లో తొలగింపులు 2 శాతం కంటే ఎక్కువగా ఉంటే ఈఆర్‌వో అన్ని దరఖాస్తులను స్వయంగా పరిశీలించాలన్నారు. పదిమంది కంటే ఎక్కువ సభ్యులు (ఓటర్లు) కలిగిన ఇళ్లల్లో ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు స్వయంగా పరిశీలించాలన్నారు. పీఎస్‌లో ఓటర్లందరూ పోలింగ్ కేంద్రానికి 2 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. తొలగింపుల కోసం వచ్చే దరఖాస్తులన్నీ ఈఆర్‌వో స్వయంగా పరిశీలించాలని ఎన్నికల ఆధికారి ఆదేశించారన్నారు. ఒక వ్యక్తి 5 కంటే ఎక్కువ కేసుల్లో అభ్యంతరకరంగా ఉన్న తొలగింపులకు సంబంధించి ఈఆర్‌వో వ్యక్తిగతంగా పరిశీలించి ఎన్నికల సంఘం ఆమోదం మేరకు నిర్ణయం తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పులు చేర్పులపై ఈఆర్‌వోలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇంటింటికీ ధ్రువీకరణ సమయంలో ప్రతి బీఎల్‌వోకు ఒక సెట్ ఎలక్ట్రోరల్ రోల్ ఇవ్వాలన్నారు. ఇంటింటా సర్వేలో కేవలం బీఎల్‌వోలు మాత్రమే పాల్గొనాలని, సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొనరాదన్నారు. ఈ సమావేశానికి తహసీల్దార్లు అంబేడ్కర్, జయప్రకాష్, డీటీ నీరజ వైఎస్సార్‌సీపీ నుంచి వీసం నారాయణరావు, పాపారావు, శీరం నర్సింహమూర్తి, శ్రీనివాసరావు, బంగారాజు, టీడీపీ నుంచి వెంకటేష్, జానకి శ్రీను, బీజేపీ నుంచి నానాజీ, రమణ, సీపీఎం నుంచి నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు అనూహ్య స్పందన



కొండకర్లలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి) : ప్రజలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి డబ్బులు చెల్లించకుండా అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని, దీనికి అనూహ్య స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు అవసరమైన వారిని గుర్తించి, వారికి స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో 1253 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొన్నారు. అంతకు ముందు రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ ఏడిద లక్ష్మి, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీలు లాలం రాంబాబు, నర్మాల కుమార్, పిన్నంరాజు వాసు, డి.శంకర్‌రావు, రాజాన విజయ్, కోట్ని శివ, పల్లె శేషగిరిరావు, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి శ్రీనివాసరావు, వెంకునాయుడు, లాలం శ్రీను, జువ్వాలనాయుడు, రమణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం..తప్పిన ప్రమాదం



నీలిగుంటలో కూలిపోయిన భారీ వృక్షం

కోటవురట్ల : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నేల గుల్ల బారి భారీ వృక్షాలు వేళ్లతో సహా నేలకొరుగుతున్నాయి. నీలిగుంట శివారు పరదేశమ్మతల్లి ఆలయం సమీపంలో కానుగ చెట్టు గురువారం తెల్లవారు జామున వేళ్లతో సహా కూలిపోయింది. విద్యుత్ తీగెలపై పడడంతో దాని బరువుకు విద్యుత్ స్తం భం విరిగిపోవడంతో పాటు మినీ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయింది. నిత్యం ఈ చెట్టు కిందే రైతులు కూర్చుని సేదతీరుతారు. తెల్లవారు జాము సయయం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గమనించి రైతులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు.

ప్రతి ఒక్కరి సంక్షేమం కోసమే జగనన్న సురక్ష



నెహ్రూనగర్ సచివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు ముఖ్య అతిథిగా హాజరై వివిధ రకాల 11 రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న రాష్ట్రంలో జగనన్న సురక్ష ద్వారా ప్రతి ఒక్కరూ తమ సమస్యలు అధికారులను నేరుగా సంప్రదించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా కార్యాలయాల చుట్టూ తిరగ కుండా ఇటువంటి సేవలు ప్రజలు వద్దకే తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య, టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండబాబు, కోఆప్షన్ సభ్యులు షేక్ సయ్యద్ బీబీ, నరసింహమూర్తి, వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు వలంటీర్‌లు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే



మునగపాకలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న వలంటీర్ దేవిక

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో జగనన్న సురక్ష సర్వే చురుగ్గా సాగుతుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 26న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అర్హులై ఉండి ఇంతవరకు ఎటువంటి పథకాలకు నోచుకోలేని వారికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

వీఆర్‌ఏల ఆందోళన



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

మునగపాక : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత బ్రహ్మాజీ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని, పే స్కేల్ వర్తింపచేయాలని అన్నారు. అర్హత కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎల్.సన్యాసిరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, డీఏలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తట్టా శ్రీను, రవి కుమార్,బాబూరావు పాల్గొన్నారు.

యండపల్లిలో జగనన్న సురక్ష నేడు

కోటవురట్ల : యండపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ధ్రువీకరణ పత్రాల కోసం వివరాలు నమోదు చేసుకున్న లబ్ధిదారులు అందరూ హాజరు కావాలని కోరారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు వినతి

ఎస్.రాయవరం : మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ అన్నారు. మండలంలో వచ్చే విద్యా సంవత్సరానికైనా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో 15కు పైగా ఉన్నత పాఠశాలలు ఉండగా రెండు వేల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరంతా 10వ తరగతి తరువాత యలమంచిలి, నక్కపల్లి, నర్సీపట్నం, అనకాపల్లి, పాయకరావుపేట తదితర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సభ్యులు సంతోష్,బాలాజీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో చిరు జల్లులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున తేలికపాటి వర్షం కురిసింది. అయితే కొన్ని గ్రామాల్లో వర్షం తక్కువగా పడింది. తక్కువ వర్షం పడిన ప్రాంతాల్లో వరి విత్తనాలు వేసుకునేందుకు ఇబ్బందులు లేవు. ఎక్కువగా వర్షం పడిన ప్రాంతాల్లో విత్తనాలు పోతకు ఆటంకం ఏర్పడింది. విత్తనాలు వేసిన తర్వాత దుక్కి చేయడానికి వీలు లేక విత్తనాలు వేసేందుకు ఆటంకం కలిగినట్లు రైతులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



గుల్లేపల్లిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: వర్షాకాలంలో దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలంతా జాగ్రత్తలను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం గుల్లేపల్లిలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజులపాటు నిల్వ నీటిని ఉంచకుండా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. మురుగులో లార్వాను విడల్చడం వల్ల దోమల వృద్ధి ఎక్కువయ్యే పరిస్థితు లున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవికుమార్, డీఎస్ఎన్ రాజు, సన్యాసమ్మ, పావని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ

గొలుగొండ: జోగుంపేట, గొలుగొండ పంచాయతీల్లో నిరుపేదలకు స్నేహం జలి ఫర్ పూర్ సంస్థ ప్రతినిధులు నిత్యావసర సరకులు గురువారం పంపిణీ చేశారు. 50 మంది పేదలకు వీటిని అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు చిట్టియ్య, బోగేష్, ప్రసాద్, బాను, నల్లయ్య మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నుంచి ప్రతీ గ్రామంలో నిరుపేదలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు అందిస్తున్నామని తెలిపారు. పేదలను ఆదుకోవడమే తమ సంస్థ ధ్యేయం అన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 21న మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ(ఆపరేషన్స్) రాజశేఖర్ తెలిపారు. తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల పరిధిలోనూ వెదురువాడ, మార్టూరు, దిబ్బపాలెం, చోడపల్లి, మోసయ్యపేట, రామన్నపాలెం, చీమలాపల్లి, భోగాపురం, దుప్పుతూరు, కోనంపాలెం, కుమారపురం, నారపాక, ఆవ సోమవరం, నునపర్తి, దోసూరు, దొప్పెర్ల, ఇరువాడ, మదుతూరు, పూడిమడకలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సెమిస్టర్ 2 పాఠ్య పుస్తకాల పంపిణీ

ఎస్.రాయవరం : పాఠశాలలో విద్యార్థు లకు పుస్తకాలు లేవనే మాట వినపడకూడదని ఎంఈవో 1 పి.అప్పారావు అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వం సమకూర్చిన సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలలకు తరలించారు. మొత్తం 15488 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, వాటిని సీఆర్పీలు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా పాఠశాలలకు తరలించడం జరిగిందని అన్నారు. వీటిని శుక్రవారం నుంచి కేటాయించిన విద్యార్థులకు పంపిణీ చేస్తారన్నారు.

దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి



తోటాడలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) పేర్కొన్నారు. తోటాడ, ఉమ్మలాడ సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో సేవలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులకు 11 రకాల ధృవీకరణ పత్రాలు అందజేస్తున్నామన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్‌లు దొడ్డి మంగవేణి, గంగయమ్మ, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, డీఎల్‌డీవో మంజులావాణి, తహసీల్దార్ ప్రకాశరావు, ఎంపీడీవో మన్మథరావు, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, బాలాజీ, వినోద్, విజయకుమార్, రాము పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు



సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

పాయకరావుపేట : గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రాజగోపాలపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిశీలించి పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ గాలికి కలిసిపోయి తరుచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, గ్రామంలో పలువురికి ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని, సొంత స్థలాలు వున్న వారికి హౌసింగ్ రుణాలు మంజూరు చేయాలని, డ్రైనేజీ సమస్య ఉందని..ఇలా పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆయా అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, సర్పంచ్ లోవరెడ్డి, నాయకులు సూర్యచక్రం, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు చీరంజీవి రెడ్డి, మహేష్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాజుబాబు, గోవిందరెడ్డి, శ్రీను, బాబీ, ఎంపీడీవో ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

ఆర్గానిక్ బెల్లం తయారీకి ప్రోత్సాహం



రాజుపేటలో ఆర్గానిక్ బెల్లం తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

కోటవురట్ల : గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి తెలిపారు. గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పలు ప్రాజెక్టులను పరిశీలించారు. రాజుపేటలోని ఆర్గానిక్ బెల్లం తయారీ కేంద్రాన్ని సందర్శించి తయారీ విధానం, ముడిసరుకు, ఎగుమతి వివరాలు తెలుసుకున్నారు. కోటవురట్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జెనరిక్ మందుల షాప్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ప్రతి వీవో నుంచి బెస్ట్ లైవ్ హుడ్స్ డాక్యుమెంటేషన్ ఉండాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో త్వరలో మహిళా మార్టు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సేంద్రియ వ్యవసాయం, ఆర్గానిక్ బెల్లం తయారీ, శానిటరీ నాప్కిన్స్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీఎం సంజయ్, ఏపీఎం రమణకుమారి, ఎంపీటీసీ రాంబాబు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

లేగ దూడల పెంపకానికి తోడ్పాటు

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ప్రసాద్‌బాబు
- రావిపాలెంలో లేగ దూడల ప్రదర్శన

అచ్యుతాపురం (అనకాపల్లి) : నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు అని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాద్‌బాబు అన్నారు. రావిపాలెంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాడి రైతులు లేగ దూడల పెంపకం ద్వారా పశుగణాభివృద్ధికి కృషి చేయాలన్నారు. లేగ దూడల ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచిన దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎఫ్ కేటగిరిలో మొదటి బహుమతి మచ్చు నాయుడు, రెండో బహుమతి గొర్లె రమణబాబుకు, మూడో బహుమతి కె.వెంకటరావుకు, ప్రోత్సాహక బహుమతి కె.అప్పారావుకి లభించాయి. సర్పంచ్ నర్మాల సుజాత, పశుసంవర్ధక శాఖ డీడీ కరుణాకర్, సహాయ సంచాలకుడు సునీల్ కుమార్, దోసూరు వైద్యాధికారి వాత్సవి, అమూల్ నోడల్ ఆఫీసర్ భానుబాబు, డీఎల్‌డీఏ డాక్టర్ సంధ్య, దుప్పుతూరు రామారావు, కె.సుబ్రమణ్యం, జగదీష్ పాల్గొన్నారు.

సీతారామ ఆలయానికి లాకర్ వితరణ



లక్ష్మీదేవిపేట సీతారామ ఆలయానికి లాకర్‌ను అందిస్తున్న కొణతాల రేవతీరావు

తుమ్మపాల: పట్టణంలో లక్ష్మీదేవిపేట శ్రీసీతారామ ఆలయానికి స్థానిక భక్తుడు కొణతాల రేవతీరావు లాకర్‌ను గురువారం బహూకరించారు. ఆలయ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆలయ అధ్యక్షుడు పాలమరశెట్టి వరాహసత్యనారాయణ మాట్లాడుతూ అబ్కారీ అధికారిగా రేవతీరావు తండ్రి కొణతాల రమణ 1996లో ఆలయానికి మూల విరాట్ విగ్రహాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి కొణతాల సాయిరాం, మాస్టర్ కొణతాల నాయుడు, ఆడారి బాబ్జి, రాపేటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో అపార అవకాశాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తుమ్మపాల: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు వివిధ రకాల నిర్మాణ సామగ్రి నాణ్యతా పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని బీవోఎంఎస్(బొమ్స్) ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని డైట్ కళాశాలలో గురువారం డైట్ ఐఈ(ఐ)చాప్టర్ విద్యార్థుల ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మోడరన్ కన్‌స్ట్రక్షన్స్ మెటీరియల్స్‌పై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో విద్యార్థులు ఉపాధి అవకాశాలు పెంచుకోవడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ప్రాక్టికల్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ గెస్ట్ లెక్చర్స్ ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్.రాము మాట్లాడుతూ డైట్‌లో ప్రపంచ స్థాయి విధానాలను అవలంబిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.